# చెడిందెవరు

పోణంగి సుబ్బలక్ష్మి

"ఆ అమ్మాయి నీకు తెలుసా?"

"తెలీదు".

"ఓరి చవటా! అదేరా సాంబ్రాణి".

"సాంబ్రాణి! అదేం పేరురా బాబు! అలివేణి నీలవేణి పేర్లు విన్నాంగాని—'సాంబ్రాణి. హారతి కర్పూరం' యివేం పేర్లురా?"

"ఏదో ఒకపేరు— వాళ్ళ అమ్మమ్మ చచ్చేటప్పుడో, వాళ్ళమ్మకి అమ్మవారు పూనినపుడో పెట్టుంటారు. పేరు సంగతి అలా ఒదిలేయి."

"మరే సంగతి?"

"ఆ అమ్మాయి సంగతి-యీ సాంబ్రాణి మన గుర్నాధంగాడి చేతిలో హారతి కర్పూరం"



"అంటే—ఆ అమ్మాయికి పీడేమన్నా అన్యాయం చేస్తున్నాడా?"

అన్యాయమేవీ చెయ్యడం లేదు. న్యాయమే చేస్తున్నాడు."

"ఏవిట్రా నీ మాటలు నువ్వూనూ—ఒకపక్కనుంచి సాంబ్రాణీ—హారతి కర్పూరం అంటున్నావు. పైగా 'గుర్నాధం'గాడంటున్నావు....పాపం ఆ అమ్మాయిని వాడు మోసంచేసి వుంటాడు."

"దీంట్లో అన్యాయం, మోసం ఏముందిరా. వాడు రమ్మన్నాడు, ఇదొస్తానంది. వీళ్లిద్దరికీ మధ్యలో డబ్బుంది".

"ఒరే రావుడూ—నువ్వింత ఘోరంగా మాట్లాడతావేరా? మన భారతదేశం పాతివ్రత్యానికి పెట్టింది పేరురా. పెద్దవాళ్ళంతా ఒకప్పుడు అబల అని 'ఆదిశక్తి' అని ముద్దుగా గౌరవంగా పెట్టిన పేర్లు, మహాకావ్యాలు వర్ణించిన తీరుతెన్నులు పోయి చివరకు ఆడది యిలా అయిపోయింది కదా కలికాలం. ఏం చేస్తాం. సరేకాని నా దగ్గర మాత్రం స్త్రీల విషయంలో కొంచెం గౌరవంగా మాట్లాడు" కోపంగా అనేశాడు మా సాంబిగాడు.

"ఒరే సాంబి—స్త్రీలమీద నీకున్న సానుభూతికి నా ధన్యవాదాలు కాని—యింతకీ నే అన్నదాంట్లో ఘోరమేవిటో చెప్పు. స్త్రీ చెడిపోవటంలో ఘోరం లేదు గాని—చెడిపోయిందని చెబితే ఘోరమా! నీలా శ్రీరంగనీతులు చెప్పే వాళ్ళే ముందుంటారు."


"శివ.... శివ...." చెవులు మూసుకున్నాడు సాంబిగాడు.

"ఒరే నాటకమాడక అసలు విషయానికి రా.డబ్బుకోసం ఎందరాడాళ్లు చెడిపోవటంలేదు?ఈ కనిపించేసత్యాన్ని ప్రత్యక్షంగా చెప్పుకొనే ధైర్యం లేదు మనకి. పైగా అది మహా పాపమట. మనది మహా గొప్ప సమాజంరా సాంబి. ఒక పక్క మనుషులంతా తప్పుడు పనుల్లోనే బ్రతుకుతుంటారు. కాని వాటిని చెప్పుకుంటే మాత్రం మహాపరాధమంటారు. ఎవరి సౌఖ్యం కోసం యిలాంటి సమాజం నిర్మించారో గాని—బలే చిత్రంరా సాంబి".

"నాయనా మొదలెట్టావా నీ సోషలిజం బోరు. ఆపు. ఇప్పటికే వినివిని పేపర్లనిండా చూసిచూసి విసిగిపోయాము. దయచేసి నన్ను కాస్త ప్రశాంతిగా బ్రతకనీయి."

సాంబిగాడి మాటకు నేను నవ్వకుండా వుండలేకపోయాను.

"సాంబి—సాంబ్రాణి గురించి నీకు తెలీదన్నావుగా. నాకు తెలిసిన విషయాలు కొద్దిగా చెబుతాను".



"మహిషాసుర సంహారిణి" చిత్రం : మారేమండ శ్రీనివాసరావు, గుంటూరు.

"చెప్పు.... చెప్పు...."ఆతృతగా అడిగాడు.

"ఈ ఊళ్ళో కింగ్స్వే ఉంది తెలుసుగా నీకు?"

"కింగ్స్వే కింగ్స్వే" అంటూ కాసేపు సణిగి చివరికి "తెలుసు" అన్నాడు.

కింగ్స్వేకి తెలుగు అనువాదం 'రాజుల దారి.' దారి రాజులదయితే నివాసం రాణులదని నీకు వెంటనే గుర్తొచ్చి వుంటుంది.

"ఓరి నాయనోయ్—అసలు విషయానికి రారా" అన్నాడు కంగారుగా సాంబిగాడు.

"విషయం ఏవిటంటే అక్కడ వరలక్ష్మి కంపెనీ వుంది, తెలుసుగా నీకు"

"తె.... తె.... తెలుసు."

"అలా భయపడకు. ఉన్న విషయాన్ని ఒప్పుకోవటానికి అంత భయమెందుకు."

"సరే చెప్పవోయ్" విసుగ్గా అన్నాడు.

"ఆ కంపెనీలో ఈ సాంబ్రాణి ఒక మెంబరు."

## చెడిందెవరు?

"అయ్యో పాపం."

"ఏం ఎందుకు బాధపడుతున్నావు?"

"ఇలా అందమైన అమ్మాయిలు చెడిపోవలసిందేనా అని."

ఆ అమ్మాయి చదివిందట కూడా. ఏం చదివిందో మనకు తెలీదు."

"ఏముంది అయిదో, ఆరో చదివుంటుందిలే"

"అదే మొత్తంమీద చదివిందని విని కిడి. ఈ మధ్యే గుర్నాధం ఆమెను పరిమినెంటు చేసుకున్నాడట".

"అబ్బబ్బ.... యీ గుర్నాధం లాంటి వాళ్ళు ఏం మనుషులోగాని...." తల పట్టుకున్నాడు సాంబి.

"పోనియ్ .... ఏం మనిషయితేనే వాడూ మనిషే. వాడే చెప్పాడు సాంబ్రాణి గురించి వివరాలు. యివ్వాళ సాయంత్రం మనిద్దరిని అక్కడకు రమ్మందట కూడా".

"అక్కడికా! మనిద్దరినా! నేను రాను. అయినా ఆవిడకు నేనెలా తెలుసు?" కంగారుగా అన్నాడు సాంబి.

"ఇప్పుడేమయిందని అంత కంగారు. ఏదో సామెత చెప్పినట్టు-యింకా వెళ్ళలేదు- చూడలేదు. అప్పుడే కంగారు" నవ్వుతూ అన్నాను.

"అది సర్లే- యింతకూ నా గురించి ఆవిడకెలా తెలుసని?"

"ఏవిటోయ్! చచ్చు ప్రశ్న నువ్వూనూ కొంపలు మునిగిపోయినట్టు. అయినా నీ గురించి ఆవిడకెలా తెలుస్తుంది? అంత కంగారు పడిపోతున్నావు- నేనేదో హాస్యానికి అంటే" చిరుకోపంతో లేచాను.

"అంతేగదా- అయినా నిన్ను మాత్రం ఎందుకు రమ్మన్నట్టు?" శ్వాస పీల్చుకుని అడిగాడు.

"ఆమె 'నన్ను' రమ్మనటంలో అర్థముందిలే. గుర్నాధం ఆవిడ గురించి నాకు చెప్పిన తరువాత ఆమె మీద నాకు చాలా జాలేసింది. నీకు తెలుసుగదా-నా అభిప్రాయాలు" ఆవిడ కేమయినా సహాయం చెయ్యాలని- కొంత డబ్బు యిచ్చి-ఆమెకిమ్మని చెప్పా. అందుకే ఆవిడ రమ్మని వుంటుంది."

"ఎలా అయినా నువ్వు చాలా తెలివయిన వాడివి. గాంధీగారంతటి వాడివవుతావు" అన్నాడు సాంబి.

ఆ పొగడ్తకు నేను లోలోపల మురిసిపోయా.

"మరి వెళదామా?" అన్నాను.

"యింక అక్కడికి మనమెందుకోయ్. చెయ్యవలసిన సహాయం చేశావుగదా! బహుశా నీకు కృతజ్ఞతలు చెప్పుకుందామని కేకేసి వుంటుంది. కృతజ్ఞతలకోసమే అయితే వెళ్ళాలంటావా? పైగా ఎవరన్నా చూస్తే ఏమనుకుంటారో ఆలోచించు."

"ఛ....ఛ.... నలుగురికి భయపడే అలవాటు మనకెప్పుడూ లేదు. పోతే కృతజ్ఞతల కోసం కూడా కాదు. ఎందుకో నాకా అమ్మాయితో మాట్లాడాలని వుంది ఎందుకలా అయిపోయిందో వివరాలు తెలుసుకుందామని వుంది."

"ఓహో! అదా విషయం- చెడిపోయిన వాళ్ళ గురించి పుస్తకమేమన్నా రాస్తున్నావేవిటి?" వ్యంగ్యంగా అన్నాడు సాంబి.

"అదేం మాటరా! పుస్తకం రాయటానికే తెలుసుకోవాలా?

"ఆపరా, నీ నీతులు. కాకపోతే ఆవిడ గురించి తెలుసుకుని దేశాన్నేం ఉద్ధరిద్దామని. ఆమె హృదయ. విదారక జీవితాన్ని అత్యద్భుతంగా చిత్రించి రాసే పేజీలను బట్టి వేలకు వేలు సంపాదించుకోవచ్చు. అంతేగదా!"

"ఒరే సాంబి నా కలాంటి దురుద్దేశం ఏమీ లేదుగాని - ఆవిడ ఈ మధ్యే దాంట్లో జాయినయింది కాబట్టి వీలయితే యింకా ఏమన్నా ధనసహాయంచేసి ఇంటికి పంపిద్దామని."

"ఆహాఁ ఏం సదుద్దేశంరా నాన్నా! అవునులే నువు పెద్ద సంస్కర్తవు కదూ! బావుంది శుభం కలుగుగాక! వెళ్ళిరా"

"అదేవిట్రా నువ్వురావా?"

"సరేలే-చెడిపోయిన వంశోద్ధారకుడివి నీతో నేను రాలేను. నువ్వెళ్ళొచ్చిన తరువాత వివరాలు చెప్పు."

* * *

ఆ రోజు సాయంత్రం గుర్నాధం చెప్పిన ప్రకారం ఆరుగంటలకు సాంబ్రాణి ఇంటికి (సాంబ్రాణి యిల్లు అనటం ఇల్లీగల్) బయలుదేరా. ఆ ప్రాంతం ఆకాశ వీధిలా వుంది. అక్కడ స్త్రీలు ఆకాశంలో చుక్కల్లా వున్నారు. లోపలికి అడుగు పెడదామంటే కొంచెం కాళ్లు తడబడ్డాయి. అయినా లోపలికి వెళ్ళిపోయా. అక్కడ గుర్నాధం చుక్కలమధ్య చంద్రుడిలా వున్నాడు. నన్ను చూడగానే "రావోయ్ రామారావ్" అన్నాడు. చుట్టూవున్న జనం లోపలికెళ్ళిపోయారు.

"ఎంతసేపయింది నువ్వొచ్చి" అడిగాను.

"ఏదీ-ఇప్పుడే వచ్చాను" అన్నాడు గుర్నాధం.

అంతలో సాంబ్రాణి కుర్చీ తీసికొచ్చి వేసింది. చాలా పెద్దమనిషి తరహాగా వుంది. జనాన్ని చూపులతో యిట్టే ఆకట్టుకోగలదు. ఒక మాదిరి మగాళ్లు ఆమెను చూడగానే "అందం అందరి హక్కు" అనే నినాదం లేవదీస్తారు.

నాకు ఏం మాట్లాడాలో తెలియక క్రింది చూపులు చూస్తున్నా-అంతలో—

"ఆయన రాలేదే" అంది సాంబ్రాణి నవ్వుతూ.

"ఎవరు?" తెల్లమొహం వేశాను.

"మీ ఫ్రెండు. సాంబశివరావు"

సాంబ్రాణి సాంబిగాడి పేరు పూర్తిగా చెప్పగానే నాకు మతిపోయింది.

"అతను మీకు తెలుసా?" అమాయకంగా అడిగాను.


నా ప్రశ్నకు సాంబ్రాణి నవ్వింది.

"ఏమిటోయ్! అలా అడుగుతావు. వాళ్ళవృత్తి అది. వాడు తెలియటంలో ఆశ్చర్యమేముంది" అన్నాడు గుర్నాధం.

సాంబిగాడు ఏ రకం మనిషో నాకప్పుడర్థమయింది.

"రమ్మంటే మహాపాపం అన్నట్టుగా మాట్లాడాడు" అన్నాను వాడిగురించే ఆలోచిస్తూ.

సాంబ్రాణి మళ్ళీ నవ్వింది,



నవ్వులో గ్లామరుంది. కళ్ళల్లో మెరుపుంది. శరీరంలో ఉత్సాహముంది.

"మిమ్మల్ని చూస్తే నాకు చాలాగౌరవమయిన అభిప్రాయం కలుగుతోంది." అన్నాను ఎలా మొదలెట్టాలో తెలియక.

''అంటే కొందరిని మీరు అగౌరవంగా చూస్తారా?" అంది వెంటనే.

ఆ ప్రశ్న నా గుండెల్ని సూదులతో పొడిచినట్లయింది. అటువంటి ప్రశ్న వస్తుందనుకోలేదు.

''అబ్బే అదేంలేదు. మీరేదో చదువుకున్నారని విన్నాను. ఇలాంటి నీచమయిన వృత్తిలో ఎందుకు చేరారు" ఎలాగో అనేశాను.

అందుకు సాంబ్రాణి కొద్దిగా నవ్వింది.

"మాది వృత్తికాదు వ్యాపారం. ఈ విషయం ముందు మిరు గ్రహించాలి".

ఆ మాటతో నేను దెబ్బతిన్నాను. ముఖం కొద్దిగా వెలవెలబోయింది. వృత్తికి, వ్యాపారానికి భేదం తెలుసుకు మాట్లాడమని ముఖంమీద కొట్టినట్టు చెప్పింది. ఒకప్పుడది వృత్తే అయినా యిప్పుడు అది వ్యాపారం అన్న సంగతి గుర్తించటానికి నాకట్టేసేపు పట్టలేదు. అయినా కొన్ని క్షణాలు నేను నిశ్శబ్దంగానే వుండిపోయాను.

"ఏమంటారు — మాది వ్యాపారమని అంగీకరిస్తారా" అంది.

అంగీకరించినట్టుగా తలకాయ వూపా.

''అయితే యిప్పుడు చెప్పండి—యిది 'నీచమయిన వ్యాపారం' ఎలా అయింది"?

యీ ప్రశ్నకు నాకు సమాధానం దొరకలేదు. ముఖం కొద్దిగా చెమటపట్టింది. మాట్లాడదామంటే నోరు తడబడుతోంది. ఆమె మాత్రం చెక్కు చెదరకుండా ప్రశాంతిగా కూర్చుంది.

"నాకు మాట్లాడటం సరిగా రాదు. నేనేమయినా తప్పుగా మాట్లాడితే నన్ను క్షమించండి" అంటూ ఏం మాట్లాడేనో నాకే తెలీదు.

సాంబ్రాణి పకపకా నవ్వింది.

''మీరు అందరి లాగానే మాట్లాడారు. లోకం మాగురించి, మా వృత్తి గురించి ఏమనుకుంటుందో అదే అన్నారు. ఎటొచ్చి మీరన్నదానికి మీరే సరియైన అర్థం చెప్పలేకపోతున్నారు" అంది.

దాంతో నా అహం దెబ్బతింది. ఆడదానితో మాట్లాడలేక పోవటమా అనిపించింది. అందరి మగాళ్ళలాగే. దాంతో కొంచెం ధైర్యం వచ్చింది.

"ఇంకో పనేదో చేసుకొని బ్రతకొచ్చు గదా. శరీరం అమ్ముకుని ఎంతకాలం బ్రతుకుతావు? సంఘం, నీతినియమాల మాట ఎలా ఉన్నా ముందు నీ శరీరం నాశనమవుతుంది గదా" ధైర్యంగా ఏకవచన ప్రయోగంతో మాట్లాడేశాను.

ఆమె ఒక్క క్షణం నన్ను సూటిగా చూసింది. ఆమె చూపులకు నేను లొంగలేదు. ధైర్యంగానే కూర్చున్నాను.

"శరీరం పాడవకుండా చూసుకుంటే చాలు— ఈ వ్యాపారం చేయదగ్గదే— అన్న అభిప్రాయం మీద మీరు స్థిరంగా నిలబడగలరా?" అని కళ్ళల్లోకి చూస్తూ అడిగింది.

"ఒప్పుకోలేను" అన్నాను.

"ఎందుచేతో చెప్పండి?" అంది.

"సంఘానికి ఉపయోగపడే వ్యాపారం ఏదయినా గౌరవించదగ్గది—ఆదరించదగ్గది మీ వ్యాపారం మిమ్మల్ని సుఖపెట్టదు సరిగదా— అనేక కుటుంబాలను నాశనం చేస్తుంది. అందుకే నేను దీన్ని గౌరవించలేను."

"సంతోషం. మీ అభిప్రాయాన్ని మీరు ఖచ్చితంగా చెప్పారు అయితే నే చెప్పేది కూడా వినండి. ఎంతో నాగరికత పెరిగిందనుకుంటున్న మన సమాజంలో— జరుగుతున్న ఏ వ్యాపారం కూడా సమాజానికి ఉపయోగపడటంలేదు. ప్రతి వ్యాపారం మోసపూరితమయిందే. మనిషిని దోచుకుంటున్నదే."

"ఎలాగో వివరంగా చెప్పండి" అన్నాను.

"దీంట్లో చెప్పేందుకేముంది— చేసే వాళ్ళంతా లక్షలు లక్షలు పెట్టుబడి పెట్టి వ్యాపారాలు ఎందుకు చేస్తున్నారు? లాభాల కోసమేగదా!"

"అవును" అన్నాను.

"లాభాలు ఎలా వస్తాయో మీకు తెలిసే వుంటుంది."

సాంబ్రాణి ఇలా అనగానే నాకు గుండె వేగంగా కొట్టుకోవటం మొదలు పెట్టింది.

'అబ్బే పెద్దగా నాకు తెలీదు' అన్నాను.

"పోనీండి. మనకు ఇప్పుడా ప్రశ్న అనవసరం కూడా. 'లాభం' అంటే మనిషి సృష్టించిన 'అధిక సంపద' అని మీరు గ్రహించగలిగితేచాలు" అంది సాంబ్రాణి.

"అవును అంతవరకు నాకు తెలుసు" అన్నాను.

"మనిషి సృష్టించిన ఈ 'అధిక సంపద' తిరిగి మనిషికి ఉపయోగపడాలి గదా! అంటే సంఘ సంక్షేమ కార్యక్రమాలకు ఉపయోగపడితేనేగదా మనుషుల్లో రోజు రోజుకు సుఖసౌఖ్యాలు పెరిగేది".

"అవును నిజమే— కాని లక్షలు లక్షలు పెట్టుబడి పెట్టి వ్యాపారం చెయ్యటం అందరికీ పంచిపెట్టటం కోసమా?" మంచి ప్రశ్నే వేసినట్టనిపించింది నాకు.

"కరెక్టు. మీకు రావలసిన అనుమానం వచ్చింది. కాని కొంచెం జాగ్రత్తగా ఆలోచించండి. అసలు వ్యాపారికి "పెట్టుబడి" అనేది ఎలా వచ్చింది? మనిషి పుట్టగానే పెట్టుబడులతో బైటపడలేదుగదా! అంటే మనిషి పుట్టేటప్పటికే "సహజంగా వున్న మూల సంపద"ని ఏదో విధంగా తన సొంతం చేసుకున్నాడన్నమాట. అంచేత "పెట్టుబడి" అనేది సాంఘిక సంపదే— సొంత ఆస్తి ఏమీకాదు. అసలు మనిషికి సొంత ఆస్తి అంటూ ఏమీ వుండదు. ఏమంటారు?" అంది సాంబ్రాణి.

"మీరు చెప్పేదంతా నిజమే అనిపిస్తోంది".

"వ్యాపారం మీద వచ్చిన లాభాల్ని అంటే "అధిక సంపదని ఎవరికి వారు సొంతం చేసుకుంటున్నారు. ఇనప్పెట్టెల్లో దాచుకుంటున్నారు. యింకా యింకా లాభాలు సంపాదించటం కోసం వాళ్ళల్లో


Anniversary Bumper

శ్రీ పద్మాలయ్ సాహిత్య పదావళి (రిజిష్టర్డు) స్పెషల్

పజిల్ నెం 13. సాతులూరు (P. O) గుంటూరు (జిల్లా) (A. P)

ముగింపు : 9-11-72. రు. 6,000లు గెల్వండి. కీ సొల్యూషన్ : 14-11-72.

జ్యోతి డైలీలో 1 ఎంట్రీ 1-00. 100 ఎంట్రీలు 80-00. 1-11-72 లోపు ముందుగా అందిన ఎక్కువ ఎంట్రీలకు 1 రిఫ్రిజిరేటర్, 2 హంబర్ సైకిళ్ళు, 4 రేడియోలు, 4 డైనింగ్ టేబుల్స్, 2 రిస్టువాచీలు, 10 పెన్నులు రైటుకాకపోయినా.


నమూనా

| | | | |
|---|---|---|---|
| 14 | 17 | 26 | 21 |
| 23 | 24 | 19 | 12 |
| 25 | 22 | 13 | 18 |
| 16 | 15 | 20 | 27 |

నిబంధనలు : (1) 14 నుంచి 28 వరకుగల అంకెలు కూపను నిలువు, అడ్డము, మూలలు ఎటుకూడినా 86 రావలెను. (2) మేము రిజిష్ట్రాఫీసులో సీలుచేసిన కీ సొల్యూషన్‌లోని ప్రతి గడిలోనికి సరిపోని అంకె ఒక తప్పుగా లెక్కించపబడును. (3) ఎంట్రీలకు M. O రశీదు జతచేయవలెను.

12 నుంచి 27 ... 14 నుంచి 29

(4) విజేతల లిస్టు. No. 14 ఎంట్రీ ఫారములకు 25 పై॥లు అడ్రసు వ్రాసిన కవరు పంపవలెను. మిగతా నిబంధనలు మామూలే.



గవాక్షం — (పల్లెటూళ్ళల్లో గాలికోసం ఇలాటి ఏర్పాట్లు వుంటాయి)

ఫొటో : కామేష్, హైదరాబాద్

## చెడిందెవరు?

వాళ్ళే పోటీపడుతున్నారు. ఈ పోటీ ద్వారా — "అధిక సంపద" అంతా ఏ కొద్దిమంది చేతుల్లోకోపోయి గుత్తాధికారులయిపోతున్నారు. అవసరమయితే మనుషుల్ని చంపేయడానికయినా ముందడుగేస్తున్నారు తప్ప— అధిక సంపదని సంఘసంక్షేమానికి ఉపయోగించటంలేదు. ఉపయోగించరుకూడా. ఈ సమాజంలో మనుషులు దిక్కూ-మొక్కూలేక చెట్టుకో పిట్టయి బ్రతకటానికి కారణం యీ విధానమే. ఏమంటారు?" అంది.

ఆవిడ చెప్పేది నాకు పెద్దగా అర్థం కాకపోయినా "అవును నిజమే" అన్నాను.

"మనిషి సంఘజీవి" అంటూ—సాంఘిక సంపద అంతా కొందరు ప్రత్యేక వ్యక్తుల సొంత యాజమాన్యం క్రింద ఉండటమంటే ఎంత ఘోరమో ఆలోచించండి."

"అవును, ఇది చాలా కరక్టు" అన్నాను.

"అందుచేత మన కర్థమయిందేమిటంటే పెద్ద పెద్ద ఉత్పత్తులంటూ జరుగుతున్న ఆయా వ్యాపారాలవల్ల దేశంలో దౌర్భాగ్యతే ఎక్కువవుతోంది. ఒప్పుకుంటారా?"

"అవును" అని తలకాయ ఊపేశాను.

"దీన్నిబట్టి పైకి సమాజ ప్రయోజనంలా కనిపిస్తూ ఉత్పత్తి పేరుతో జరుగుతున్న ప్రతి వ్యాపారం సమాజానికి ద్రోహమే చేస్తోందని నిర్ధారణయింది."

"సరే" అన్నాను.

"సమాజానికి ఉపయోగపడని వాటిని మీరు గౌరవించరుగా?"— అంది యిందాకనే అన్నమాట నాకు తిప్పికొడుతూ.

"గౌరవించను".

"బాగుంది. నాకిప్పుడు చాలా సంతోషంగా వుంది. నిజాన్ని మీరు నిర్భయంగా ఒప్పుకున్నారు.

"అది నిజమయితే ఎవరయినా ఒప్పుకుంటారు."

"మీరు చాలా అమాయకులు. అలా ఒప్పుకుంటె మనిషికి బాధలే వుండవు. అంతా ఒప్పుకున్నా యీ లాభాల మనుషులు మాత్రం ఒప్పుకోరు."

"ఎందుచేత?"

"వాళ్ళ ఉత్పత్తి విధానం సామాజికావసరాలకు వ్యతిరేకంగా వుండటంచేత, లాభాలే వాళ్ళ సర్వస్వం కావటంచేత, తమ సౌఖ్యంకోసం తోటిమానవుని ఎలా వీలయితే అలా దోచుకోవటంచేత".

నాకు తర్వాత ఏం ప్రశ్న వెయ్యాలో తెలియలేదు. నేను ఏవోమాట్లాడుతున్నానే గాని ఆవిడంత ఘనంగా మాట్లాడలేకపోతున్నాను. మొత్తంమీద ఆవిడ చాలా చదివిందని మాత్రం గ్రహించాను.

ఆమె మళ్ళీ మాట్లాడింది—

"ఇక నిజంగా గౌరవించవలసిన వ్యాపారం ఏమన్నావుంటే అది మాదే. దీంట్లో మోసం, దగాలు లేవు. సమాజానికి ఉపయోగపడుతున్నట్టు కనిపించి దాన్ని దోచుకుతినే వ్యాపారంకాదు మాది. మేము ఒకళ్ళకు ఉపయోగపడుతూ. మేమేక్షీణించి పోతాం. ఇక్కడ మేము వ్యాపార వస్తువులం మాత్రమే. మాకేవిధమైన సొంత ఆస్తులు, పెట్టుబడులు లేవు.

"అందుకే యీ సమాజం మమ్మల్ని చెడిపోయారంది."

"అవును. నిజమే. మేమేకాదు—సొంత ఆస్తులు, పెట్టుబడులు లేని దరిద్రులంతా చెడిపోయిన వాళ్ళే యీ సమాజంలో. అసలు వాళ్ళు మనుషులేకారు. వాళ్ళకు దిక్కూ-మొక్కూ లేదు. కాని చెడిపోయిన వాళ్ళందరికీ యీ విషయాలు తెలియవు. మేమొకళ్ళమే చెడిపోయాంఅనుకుంటారు. నిజం చెప్పవలసివస్తే యీ సమాజంలో మేమొకళ్ళమే 'మంచి' వాళ్ళం. మంచిగా, గౌరవంగా బ్రతుకుతున్నామనుకున్న వాళ్ళంతా ఏదో రకంగా ఖావదాస్యం చేస్తున్నవాళ్ళే. గౌరవాలతో గొప్పలతో వాళ్ళలోవాళ్ళే కుళ్ళిపోయి సత్యాన్ని ఒప్పుకోలేక బ్రతుకుతున్నారు. వాళ్ళుమాత్రం ఏంచేస్తారు? — రాజకీయ, ఆర్థిక విధానాన్ననుసరించేవాళ్ళ నడవడిక వుంటుంది. తోటివాడిని ఏదోవిధంగా దోచుకుంటూ వాడిని అసంతృప్తిలో ముంచి తాము సంతృప్తి అనుభవిస్తున్నారు. తమలో తామెవ్వరికి మంచి సంబంధాలుండవు. ఎవ్వరూ మనస్ఫూర్తిగా మాట్లాడుకోలేరు. ఒకళ్ళ మీద ఒకళ్ళకు కుట్రలు, కుహకాలు.... ప్రతిక్షణం సాగుతూనే వుంటాయి. మేము వీటన్నింటికి దూరంగా నిర్మల హృదయాలతో జీవిస్తున్నాము. ఈ సమాజం అందరికీ బ్రతికేందుకు ఏదో ఒక మార్గం చూపించదు. తప్పని సరియైవాళ్ళే ఏదో మార్గం వెదుక్కుంటే చెడిపోయారని, దుర్మార్గులని.... యింకా ఏవో పేర్లుపెట్టి అరుస్తుంది. వాళ్ళల్లో మానసిక బెడదల్ని రేపి వాళ్ళకున్న కాస్త ప్రశాంతిని చెడగొడుతుంది. "చెడిపోయిన వాళ్ళు" "మంచివాళ్ళు" అని విడదీసి మాట్లాడే ముందు— మనుషుల సంబంధాలని, సాంఘిక పరిస్థితుల్ని దాని ఆర్థిక సూత్రాలని మనం బాగా పరిశీలించాలి. అప్పుడే ఏది "మంచి" ఏది "చెడు" అనేది మనం సరిగ్గా నిర్ణయించగలుగుతాం."

నాకు ఆవిడ భాష, మాట్లాడే తీరు చూస్తుంటే మతిపోతోంది.

ఇక వుండబట్టలేక అడిగేశాను.

"మీరేం చదివారో కాస్త చెబుతారా"

సాంబ్రాణి మాట్లాడకుండా లోపలికెళ్ళి ఒక కాగితం తెచ్చి నాకిచ్చింది. అది ఆమెకు "అర్థికశాస్త్రం"లో ప్రావీణ్యురాలిగా గుర్తించి యూనివర్శిటీ వాళ్ళిచ్చిన మాష్టరు పట్టా. అది చూసి నాకు శరీరంలో ఒణుకు ప్రారంభమయింది. ఈవిడికా నేను డబ్బు సహాయం చేసింది. తెల్లమొహంతో ఆవిడకు నమస్కారం పెట్టి లేవబోయాను.

"కూర్చోండి. అసలు విషయం చెప్పకుండానే వెళ్ళిపోతే ఎలా?" నన్నుకూర్చోబెట్టింది.

నాకెందుకో చాలా భయమేస్తోంది.

"ఏవిటో చెప్పండి" అన్నాను.

మీరు నాకు డబ్బు పంపించటంలో మీ

ఉద్దేశ్యం ఏవిటో వివరంగా చెప్పాలి" అంది.

నాకు గుండెల్లో రైళ్ళు పరుగెత్తాయి. అయినా నేను చేసిన దాంట్లో తప్పేముంది. ఏదో మంచితనంతో ఆవిడకు సహాయపడ దామనే గదా—అలా చేశాను. కొంచెం ధైర్యం చిక్కింది.

"ఏముంది తోటివాళ్ళకు కొంతయినా సహాయపడదామనే మానవత్వం" అన్నాను.

"బావుంది. మనిషికి మానవత్వం వుండ వలసిందే. తోటివాళ్ళంతా తనవాళ్ళే అనుకోవటం చాలా గొప్ప విషయం. కాని మీరొకటి గ్రహించాలి. మానవత్వంతో ఒక సమస్యను పరిష్కరించాలనుకుంటే— అందుకు ముఖ్యంగా సహృదయమే చాలదు. సమగ్రపరిశీలన కావాలి. అప్పుడే ఆ సమస్యకు సంపూర్ణ పరిష్కారం యివ్వగలం. ఏ విధమయిన పరిశీలన పఠన లేకుండా ఉత్త సహృదయంతో తోటివాడి మీద దయ చూపిస్తే వాడికి సుఖంకంటె దు:ఖమే ఎక్కువవుతుంది. మీరు డబ్బుతో ఎంతమందిని మార్చగలరు. నాలాంటివాళ్ళు లక్షలున్నారు. వాళ్ళందరిని డబ్బుతో మార్చగలరా? నిరుద్యోగానికి, దరిద్రానికి డబ్బు కారణంకాదు. మనకున్న సాంఘిక, వ్యవస్థ అలాంటిది. దాన్ని మార్చాలి. సుఖం, సంతృప్తి అనేవి డబ్బుతో సాధించలేం. సుఖశాంతులు మనం నిర్మించుకున్న ఆర్థిక, రాజకీయ సంబంధాల మీద ఆధారపడివుంటాయి. బిడ్డల్ని పెంచటంలో తల్లిదండ్రుల పాత్ర ఎలాంటిదో సమాజసభ్యుల్ని పెంచటంలో ప్రభుత్వ పాత్ర అలాంటిది. సమాజసభ్యుల్లో సత్సంబంధాలు నెలకొల్పటంలో రాజ్యాంగ సభ్యులు మహత్తర మేధా సంపన్నులయి వుండాలి. సమదృష్టి, సహృదయత కావాలి. వారిలో వర్గవైఖరి, ఒంటెత్తు పోకడలు వున్నంతకాలం—వాళ్ళు చేసే చట్టాలు, సూత్రాలు సమాజంలో అల్లకల్లోలాలనే లేవదీస్తాయి. మీరు సమర్థులు. సమ్యగ్దృష్టి గలవారు. అయితే అందరికి స్థిరమయిన సుఖశాంతులు ప్రసాదించటానికి ప్రయత్నించండి. అంతేగాని యిలా డబ్బు సహాయం చెయ్యటంవల్ల, లేకపోతే నామీద జాలి చూపించి మీ యింట్లో పనియిప్పించటం వల్ల ఉపయోగంలేదు. అసలు నాకు డబ్బు సహాయం చెయ్యటానికి మీరెవరు? ఇలాంటి దానాలవల్ల ఎదటివాళ్ళు ఎంత షాక్ తింటారో ఆలోచించారా? ఈ సమాజంలో మీకు. నాకు తేడా ఏవిటి? దీని తప్పుడు ఆర్థికసూత్రాలవల్ల మా బ్రతుకు లిలా వున్నాయిగాని—మేమూ నిక్షేపంగా బ్రతకవలసిన వాళ్ళమే. మీరు సమస్యను పరిపూర్ణంగా ఆలోచించకుండా డబ్బు సహాయం చేసేస్తే నేను సుఖపడిపోతాననుకున్నారు. కనీసం నాలాంటివాళ్ళు లక్షలకొలది వున్నారన్న సంగతికూడా మీరెప్పుడూ ఆలోచించినట్టులేదు. దీన్నే జీవకారుణ్యమంటారు. ఇలా నలుగురికి ఉపయోగపడి దేశాన్ని బాగుచేసేద్దా మనుకుంటే దాన్ని సంస్కరణ అంటారు. యివి సమస్యను పరిష్కరించక పోగా మనుషులకున్న కాస్త ప్రశాంతిని కూడా వుంచవు. మానసికంగా చిత్రవధ చేస్తాయి. నేనెందుకు పనికిరానపుడుగదా నామీదదయ చూపించటం, ఒకప్రక్క నా సామర్థ్యం వినియోగ పడటంలేదు. మరోప్రక్క నామీద అనవసరమయిన దయ చూపిస్తున్నారు. దీనిమూలంగా నా మానసికవిధానం ఎలా తయారవుతుందో ఆలోచించండి. ఒకవైపు యింత చదువుకుని ఎందుకు ఉపయోగపడటంలేదే అన్నబాధ. రెండోవేపు ఒకరి దయకు లోనై బ్రతుకుతున్నానే అన్న ఆలోచన—యివి మనిషిని కాల్చుకు తింటాయి. జీవితంమీద ఆశను చెడగొడతాయి. అసంతృప్తిని రేకెత్తిస్తాయి. ప్రతి మనిషి తన సామర్థ్యానికి తగ్గ పనిలో స్థిరపడినప్పుడే నిజమయిన సంతృప్తి. అలా ఎవరి సామర్థ్యానికి తగ్గ పని వాళ్ళకు చూపించకపోతే అది "నిర్వహణకు" సంబంధించిన లోపం. లోపాన్ని అక్కడ సవరిస్తే మీ మానవత్వంలో వున్న పరమార్థం నెరవేరుతుంది తప్ప యిలా "దయ" చూపించటంవల్ల రూపాయో. రెండు రూపాయలో ముష్టి వేద్దామనుకోవటంవల్ల ఉపయోగం లేదు. పుండుమీద కారం చల్లినట్టు-ఉత్పత్తి పేరుతో పెట్టుబడులు వ్యాపారాలు మనిషిని తిండి లేకుండా మాడుస్తుంటే — "మానవత్వం" పేరుతో "జీవకారుణ్యం" "సంస్కరణ"లాంటి పద్ధతులు మనిషిని కుళ్ళి కుళ్ళి చంపుతున్నాయి. అంచేత మీరిలాంటి పనులు చేయకండి. అన్ని సమస్యలకు మూలకారణం కనుక్కోండి. మానవ సామర్థ్యం సరియైన దారిలో ఉపయోగపడేటట్టు చూడండి. తప్పుడు పద్ధతులద్వారా మానసిక బెడదలను రెచ్చగొట్టి హత్యలకు-ఆత్మహత్యలకు కారణం కాదండి. ఆర్థిక, రాజకీయ, సాంఘిక పరిస్థితుల్ని పరిశీలించి మెడిసిన్ తయారు చెయ్యండి. అప్పుడంతా పరిపూర్ణమయిన సుఖ శాంతులతో జీవించగలుగుతారు. అంతవరకు మాలాంటి దరిద్రుల బ్రతుకు లింతే, నేను ఇంత చదవటానికి ఎంత కష్టపడ్డానో, మా కుటుంబం ఏమయిపోయిందో చెప్పాలంటే చెప్పొచ్చు. నా చదువుకు ఎవడో సహాయం చేశాడనో, వాడు నన్ను

## సుభాషితాలు

పురుషులు ప్రేమించినన్నాళ్ళూ కలలు కంటూ పెళ్ళిరోజున మేల్కొంటారు.

— అలెగ్జాండర్ పోప్

*   *   *

పెళ్ళనేది తరుచూ వాదనలతో అడ్డగింపబడే ఓ సుదీర్ఘమైన సంభాషణ.

—రాబర్ట్ లూయీ స్టీవెన్సన్

*   *   *

కన్యలు మంచి భర్తల్ని తప్ప యింకేమీ కోరుకోరు. ఆ భర్త దొరికాక. అంతులేకుండా అన్ని కోరికలు కోరుతూనే వుంటారు.

— విలియం షేక్స్పియర్

*   *   *

ఓ అమ్మాయి, అబ్బాయి పెళ్ళి చేసుకున్న రోజున. వారి ప్రేమ కథ అగి, వారి చరిత్ర ప్రారంభ మవుతుంది.

—రో షెబ్రూన్

*   *   *

వివాహమనేది, పురుషుడి ధైర్యానికి అధికారానికీ స్వస్తినీ, స్త్రీ అధికార స్వాతంత్ర్యాలకు నాందినీ పలుకుతుంది.

—డుపే

*   *   *

తొందరపడి పెళ్ళి చేసుకుంటే తీరిగ్గా పశ్చాత్తాపపడక తప్పదు.

—విలియం కాంగ్రీవ్

*   *   *

ఓ మంచిస్త్రీతో వివాహం, తుఫానులో దొరికిన వోడ్డులాటిది. అదే వో చెడు స్త్రీతోవివాహం, వొడ్డున లేచిన తుఫానులాటిది.

— జె. పి. సెన్

*   *   *

వివాహం పురుషుడి జీవితంలో పూచే వసంతమన్నా కావచ్చు, ప్రవేశించే మహమ్మారి బనా కావొచ్చు.

— లార్డ్ బైరన్

*   *   *

పెళ్ళనేది కత్తెరలోని రెండుభాగాల్లాంటివి. అవి విడదీయను రాకుండా అతుకబడి, ఎప్పుడూ విరుద్ధ దిశల్లో కదుల్తాయ్. మధ్యవచ్చిన వాటిని మాత్రం కత్తిరించి పారేస్తాయ్.

— సిడ్నీ స్మిత్

సేకరణ:

బెళదోణ సుధ

## చెడిందెవరు?

లేపుకొచ్చాడనో, నమ్మక ద్రోహం చేశాడనో....ఎన్ని కథలయినా చెప్పొచ్చు. కాని ఎందుకు? అవన్నీ చెప్పటంవల్ల ఉపయోగం లేదు. నా దౌర్భాగ్య జీవితానికి అవన్నీ మూలకారణం కాదు. ఏ విధంగానూ బ్రతికేందుకు దారి లేకే ఈ విధంగా స్థిరపడ్డాను. మీరు నాకు డబ్బు యివ్వగలిగినా సంతృప్తి ఇవ్వలేరు. ప్రతి మనిషికి తన సమాజ ఉత్పత్తి కార్యక్రమాలతో ఏదో విధమయిన సంబంధం ఉన్నప్పుడే నిజమయిన సంతృప్తి. అంచేత మీ డబ్బు మీ దగ్గరేఉంచుకోండి. మీ సహృదయానికి నా ధన్యవాదాలు" అంటూ నేను పంపిన డబ్బు నా చేతిలో పెట్టేసింది.

నాకు శరీరమంతా గగుర్పొడిచింది. నోరు తడబడి మాటలు సరిగా రాలేదు.

"క్షమించండి. మీరు చెప్పేవన్నీ నాకు తెలీదు. "ఏదో మంచితనం" కొద్దీ తోటి వాళ్ళకు కొంచెం సహాయపడాదామనుకున్నాను. అంతకుమించి వేరే...." మాటలు సరిగా రాలేదు.

"నిజమే. మీ మంచితనం హర్షించదగ్గదే. మీ హృదయం మంచిదే. అందుకు మిమ్మల్నేమీ అనటంలేదు. కాని "మంచితనం" "సహృదయం" పేరుతో మీరు చేస్తున్న పనివల్ల వచ్చే ఫలితం మాత్రం వివరించాను. పైకి మంచిగాను, అహింసాయుతంగాను కనిపించే పనులు మనుషుల్ని ఎంత హింసిస్తాయో చెప్పాను."

"అర్థమయింది. నాకూ ఏవో కొద్దిగా అభివృద్ధికరమైన ఆలోచన లున్నాయి. కాని— నేనింకా చాలా తెలుసుకోవాలి" అన్నాను.

"అలాగే తెలుసుకోండి. అన్నీ ఆలోచించి ఏం చెయ్యాలో అది చేయండి. అంతే గాని "మానవత్వం" పేరుతో ఏం చెయ్యకూడదో అది చేస్తే మాత్రం మాలాంటివాళ్ళ జీవితాలు యింకా ఘోరమవుతాయి. రాజ్యాంగ రీత్యా ఎలాంటి రక్షణ, ఆధారంలేని ప్రజల పర్సంటేజ్ మన సమాజంలో ఎక్కువవుంది. అందుకే అలాంటి వాళ్ళంతా జీవితాల్లో ఎలా స్థిరపడ్డా ఆశ్చర్యపోనక్కరలేదు. వాళ్ళు ఏం చేసినా తప్పు అనవలసిన పనిలేదు. దిక్కులేనవుడేం చేస్తారు? ఏదో ఒకటి చేసి ఆకలి మంట చల్లార్చుకుంటారు. కాని వాళ్ళను అలాక్కూడా బ్రతకనివ్వకుండా "వాళ్ళుచేసే ప్రతిపనికి అదినీతి, ఇది అవినీతి అది మంచి యిది చెడు, అది పాపం— యిది పుణ్యం, అది పాతివ్రత్యం — యిది వ్యభిచారం...." ....యిలాంటి పెద్ద కబుర్లన్నీ చెబుతారు. వాళ్ళకు కాస్త కడుపు



సింగారించుకొని

వై. బాలయ్య, సిద్దిపేట

నిండి కాస్త సుఖంగా నిద్రపోయే మార్గం మాత్రం ఎవడూ చూపించడు. ప్రతి మనిషికి ఏదో ఒక పని చూపించి కాస్త తిండీ. గుడ్డా. నివాసంచూపించే రాజ్యాంగం కావాలి. అందుకు మీలాంటి యువకులు— తెలివయిన వాళ్ళు సమర్థులు కావాలి."

ఒకప్పుడెవరయినా నన్నలా పొగిడితే నేను చాలా సంతోషించే వాడిని, ఇప్పుడు ఆమెఅలా అనగానే ఏడుపొచ్చింది.

"మీ కంటే తెలివయిన వాళ్ళెవరుంటారు" అన్నాను సానునయంగా.

ఆ మాటకు సాంబ్రాణి కాస్త నిరుత్సాహంగా నవ్వి—

"నేను తెలివయిన దానిని కావచ్చేమో గాని సమర్థురాలిని కాదు. నాలాగే చాలా మంది వున్నారు. వాళ్ళల్లోకూడా తెలివితేటలు మంచితనం అన్నీవున్నాయి గాని సమర్థతే కొరవడింది. మన సమాజం ఎంత చిత్రమయిందంటే—యిందులో పుట్టి పెరిగి నిజాల్ని గుర్తించే వయసొచ్చే సరికి వాళ్ళల్లో మంచితనం, తెలివితేటలతోపాటు "బలహీనతలు" కూడా చోటుచేసుకుంటున్నాయి. దానితో "మన కెందుకులే" అని "ఎలాగో కళ్ళు మూసుకుంటే జీవితం గడిచిపోదా" అని .... నిరుత్సాహంలో బ్రతుకుతున్నారు కొందరు. మరికొందరు అణగారిన, దగాపడిన ప్రజలకోసం ఉపన్యాసాలిస్తున్నారు. ధనసహాయం చేస్తున్నారు. భౌతిక పరిశీలన లేని పనికిమాలిన విషాదగాథలు వేలకు వేల పేజీలువ్రాసి పాఠకులకు కన్నీళ్ళు తెప్పిస్తున్నారు. వీటన్నిటికి "అభివృద్ధి" అని పేరుపెట్టి దేశాన్ని మరోసారి మోసం చేస్తున్నారు.

"బహుశా వీళ్ళు నాలాంటి వాళ్ళే అయ్యుంటారు" మనస్ఫూర్తిగా అన్నాను.

"అవును, వీళ్ళు మంచివాళ్ళే. కాని వీళ్ళకు సమాజ స్వరూపం గురించి సరియైన అవగాహన లేకపోవటం చేత అలాంటి పనులన్నీ చేస్తున్నారు. మనకు కావలసింది అలాంటివాళ్ళు కాదు. ప్రజల ముందుకెళ్ళి వాళ్ళతో ప్రత్యక్ష సంబంధాలు పెట్టుకుని పనిచేసే సమర్థులు కావాలి. వాళ్ళొక్కొక్కళ్ళు కొన్నివేలపేజీల సాహిత్యంతో సమానం. వాళ్ళే దరిద్రుల కొందారి చూపించేది. సమాజానికో శాస్త్రీయ నిర్మాణం యివ్వగలిగేది. అంతవరకు అందరి బ్రతుకులు విషాదాలే. మంచితనానికి, నిజానికి సరియైన స్థానం లేనంతకాలం— ఏవి తప్పో ఏవి ఒప్పో మనం నిర్వచించలేం. అంతవరకు ఎవరు ఎలా బ్రతికినా తప్పు అనలేం. పెళ్ళాన్ని పోడిచినవాడినీ తప్పు అనలేం. పెళ్ళాన్ని తార్చినవాడినీ తప్పు అనలేం. మనసు ప్రశాంతిగా ఉంచుకుంటే చాలు. ఈ సమాజంలో ఎలా బ్రతికినా తప్పు లేదు" అని ఆమె చెప్పడం ఆపింది.

నేను ఆమె చెప్పేవన్నీ శ్రద్ధగా విన్నాను. ఆ పరిస్థితిలో ఆమెతో నేనేం మాట్లాడగలను. ఆమెకు తెలిసిన ఎన్నో విషయాల్లో నాకు తెలిసిందెంత? ఆమె నా ముఖం మీదే నన్ను "మోసగాడు" అన్నా నేనేం బాధపడలేదు. ఆ మాటలో ఉన్న అంతరార్థం నేను గ్రహించాను.

"మీ ద్వారా నాకు చాలా విషయాలు తెలిశాయి. మీకు నేను సహాయం చేద్దామని వస్తే— మీరే నాకు చాలా సహాయం చేశారు మరి నా ప్రయత్నం నేను చేస్తా. నమస్తే. వస్తాను" అంటూ లేచాను.

"చాలా సంతోషం వెళ్ళి రండి" అంది సాంబ్రాణి.

గుర్నాథం గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. అతన్ని చూస్తే ఒక్క మబ్బు కూడా లేని నిర్మల నీలాకాశం గుర్తొచ్చింది. నాలో నేనే నవ్వుకున్నాను. అంతలోనే సాంబిగాడు గుర్తొచ్చాడు. నాకు వాడు కూడా మంచివాడిలాగే కనిపించాడు. ఎటొచ్చి నాకు నేనే దుర్మార్గుడిలా కనిపించాను— నన్ను నేను క్షమించుకోలేకపోయాను. ★